క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసరాలు,దుప్పట్లు



విజయవాడలో వరద బాధితులకు నిత్యావసరాలు, దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని దాతల ద్వారా సేకరించిన మొత్తంతో సుమారు 200 మంది విజయవాడ వరద బాధితులకు ఆదివారం నిత్యావసర వస్తువులు, దుప్పట్లు అందజేశారు. ఇందుకు అవసరమైన రూ.50 వేల మొత్తాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఏఎస్వో జె.వెంకటేశ్వరరావు తన స్నేహితులు, దాతల ద్వారా సేకరించారు. విజయవాడలోని రాజేశ్వరి నగర్, బుడమేరు వంతెన, సింగ్ నగర్, వాంబే కాలనీ, వైఎస్సార్ నగర్, సితార జంక్షన్లలోని బాధితులకు నేరుగా అందజేసినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ సభ్యులు, చిడిపి దేవోక్తి సోషల్ సర్వీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్, రూరల్ ఫీడర్ల విద్యుత్ వినియోగదారులకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు ఆదివారం తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు, కొత్తగా 11 కేవీ బ్రేకర్ ఏర్పాటు చేసే నిమిత్తం అనంతపల్లి, కృష్ణమ్మగూడెం గ్రామాల్లో సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. అనంతపల్లి రూరల్ ఫీడర్‌పై త్రీ ఫేజ్ సప్లయి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇస్తామన్నారు.

వేలం కేంద్రంలో స్వచ్ఛతాహి సేవ



దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

దేవరపల్లి: స్వచ్ఛతా హి సేవలో భాగంగా స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం సాయంత్రం పరిసరాలను పరిశుభ్రం చేశారు. వేలం కేంద్రం ప్రాంగణంలోని ముళ్ల పొదలు, పిచ్చ మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2 వరకూ కొనసాగుతుందని వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత తెలిపారు. కార్యక్రమంలో వేలం కేంద్రం సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఆశ్రమానికి చేరిన వృద్ధురాలు



గొల్లగూడెంలోని వృద్ధాశ్రమంలో మతిస్థిమితం లేని వృద్ధురాలు

గోపాలపురం: మతి స్థిమితం లేని వృద్ధురాలిని పోలీసులు ఆదివారం ఆశ్రమంలో చేర్పించారు. ఆ వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెరుకుమిల్లి గ్రామ శివార్లలోని పొలంలో సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు పడి ఉంది. ఆమెను గుర్తించిన ఓ ఆటో డ్రైవర్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి పోలీసులకు అప్పగించాడు. మతిస్థిమితం లేని ఆ వృద్ధురాలిని ఎస్సై సతీష్‌కుమార్ ప్రశ్నించగా తన పేరు మానేపల్లి నాగమణి అని, తనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానమని చెప్పింది. పిల్లలు తన పింఛను సొమ్ము తీసుకొని భోజనం పెట్టడం లేదని మాత్రమే చెబుతోంది. దీంతో పోలీసులు ఆమెను దేవరపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలోని లగడపాటి రామలక్ష్మమ్మ వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు గోపాలపురం పోలీస్ స్టేషన్ లేదా 94407 96665 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని ఎస్సై కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని పిండ ప్రదానాల రేవులో ఆదివారం సుమారు 60 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదని తెలిపారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఇసుకే బంగారమాయె..



నిడదవోలు మండలం పెండ్యాల స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉన్న ఇసుక



పెండ్యాల రైతు సేవా కేంద్రం వద్ద ఇసుక స్లాట్ కోసం బారులు తీరిన వినియోగదారులు (ఫైల్)

- వేధిస్తోన్న ఇసుక కొరత
- పెండ్యాలలో ఖాళీ అవుతున్న స్టాక్ పాయింట్
- అందుబాటులో మరో 46 వేల మెట్రిక్ టన్నులే..
- కూటమి నేతల అండదండలతో దళారుల దందా
- అధిక ధరలకు కొనుగోలు చేస్తుండడంతో నిర్మాణదారుల జేబులకు చిల్లు
- జిల్లాలో అందుబాటులోకి రాని ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ

నిడదవోలు రూరల్: ఇసుక బంగారమైంది. సామాన్యులకు దొరకడం గగనమైంది. గోదావరి వరదలతో జిల్లాలోని ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోపక్క కూటమి నాయకుల అండదండలతో స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను రేట్లు పెంచి ఇష్టానుసారంగా విక్ర



సమిశ్రగూడెంలో ఇసుక కొరతతో నిలిచిపోయిన ఇళ్లు

యిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక విక్రయాలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తోంది. ఈనెల 20వ తేదీ వరకూ ప్రభుత్వం ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ ప్రారంభించలేదు. ఇదే అదనుగా దొరికిన కాడికి దళారులు దోచుకున్నారు. జిల్లాలో మాత్రం ఇంకా ఆన్‌లైన్ బుకింగ్ అందుబాటులోకి రాలేదు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభించగా పెండ్యాల ర్యాంపు నుంచి వినియోగదారులు ఇసుక బుక్ చేసుకుంటున్నారు. రవాణా చార్జీలు సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. నియోజకవర్గంలోని ఇసుక స్టాక్ పాయింట్లు అయిన నిడదవోలు మండలం పందలపర్రులో 52.082 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 1,46,249 మెట్రిక్ టన్నులు, పెరవలి మండలం ఉసులుమర్రు వద్ద 33,065 మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్టు గుర్తించి, విక్రయాలు చేపట్టారు. అయితే ప్రస్తుతం పందలపర్రు, ఉసులుమర్రులో విక్రయాలు నిలిచిపోగా ఇంకా పెండ్యాల స్టాక్ పాయింట్ వద్ద 46 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది. మరో వారం రోజుల్లో ఈ స్టాక్ పాయింట్ వద్ద కూడా ఇసుక పూర్తిగా ఖాళీ కానుంది.

లారీకి రూ.3 వేల పైనే అక్రమ వసూలు

ప్రతి స్టాక్ పాయింట్ వద్ద డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో పాటు సచివాలయ సిబ్బందిని స్టాక్ బుకింగ్ కోసం నియమించారు. పెండ్యాల, పందలపర్రు రైతు సేవా కేంద్రాల్లో ఇసుక స్లాట్ బుకింగ్ ద్వారా టన్నుకు రూ.270 చెల్లించి బుకింగ్ చేయాల్సి ఉంది. అయితే ఇక్కడే దళారులు రంగ ప్రవేశం చేశారు. లారీ ఇసుక బుక్ చేసేందుకు స్లాట్ కోసం క్యూలో నిలబడినందుకు అదనంగా రూ.3 వేల పైనే అక్రమంగా వసూలు చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే గొడవలు పెట్టుకుని కూటమి నేతలతో ఫోన్ చేయించి అధికారులను బెదిరిస్తున్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద టన్ను రూ.270 చెల్లించి కొనుగోలు చేస్తున్న లారీల యాజమానులు నిర్మాణదారులకు మాత్రం రవాణా చార్జీల పేరిట ఇష్టానుసారంగా రూ.వేలల్లో వసూలు చేసి చుక్కలు చూపిస్తున్నారు. రాత్రి 6 గంటలకే స్లాట్ బుకింగ్‌లు నిలుపుదల చేయాల్సి ఉండగా దళారుల ఆందోళనలతో అర్ధరాత్రి వరకూ ఇసుక లోడింగ్‌లు జరిగాయి. వినియోగదారులు మాత్రం ఇసుక బుకింగ్ కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

నిర్మాణ రంగం కుదేలు

ఇసుక కొరత వేధించడంతో నిర్మాణ రంగం కుదేలైంది. దీంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వర్షాలతో ఇప్పటికే పనులు లేకపోవడంతో పస్తులు ఉంటున్నామని, మళ్లీ ఇసుక కొరతతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ఉచితంగా ఇస్తున్నామని, లోడింగ్ చార్జీలకు టన్నుకు రూ.270 మాత్రమే వసూలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మాత్రం అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తోంది. ఇసుక కొరతతో బ్లాక్ మార్కెట్లో ఇసుక ట్రాక్టర్ రూ.4 వేల నుంచి రూ.5 వేలు, 20 టన్నుల టిప్పర్ లారీ రూ.15 వేలకు పైనే వసూలు చేస్తున్నారు. కొంతమంది దళారులు ఇసుక స్టాక్‌ను పెట్టి రాత్రివేళల్లో విక్రయిస్తున్నారు. ఇప్పటికైన అక్రమ ఇసుక దందాను అరికట్టి అందుబాటులో ఇసుక లభ్యమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి భారీగా భక్తులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం రూపంలో రూ.1,16,609 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల అన్న సమారాధనలు

ఉండ్రాజవరం: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అన్న సమారాధనలు నిర్వహించారు. తాడిపర్రు గ్రామంలోని సిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 21 రకాల వంటకాలతో అఖండ అన్నసమారాధన చేశారు. ఉండ్రాజవరం గోస్తానది తోట వినాయకుడి ఆలయం వద్ద సుమారు 4,000 మందికి వివిధ రకాల పిండి వంటలతో అన్న సమారాధన నిర్వహించారు. కె.సావరంలో శ్రీవిజయ గణపతి ఉత్సవాల్లో భాగంగా రామాలయం వద్ద అన్నసమారాధన చేశారు.

నిడదవోలు రూరల్: గణపతి నవరాత్ర మహోత్సవాలు ముగిసిన సందర్భంగా సమిశ్రగూడెం నందిబొమ్మ వద్ద, డి.ముప్పవరం ప్రధాన సెంటర్‌లో, తాడిమళ్ల గ్రామాల్లో ఆదివారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్తంభాలు సరి చేసిన అధికారులు



ఈ నెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం





దేవరపల్లి ఊర చెరువు గట్టున చెట్టును ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేసిన దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

దేవరపల్లి: స్థానిక ఊర చెరువు గట్టుపై ప్రమాదకరంగా ఉన్న మూడు విద్యుత్ స్తంభాలను అధికారులు సరి చేసి నిలబెట్టారు. ' ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు.. పట్టించుకోని అధికారులు' అనే శీర్షికన ఈ నెల 3న సాక్షిలో ప్రచురితమైన కథనాని విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. చెరువు గట్టున చెట్టుపై విద్యుత్ స్తంభం పడి తీగలు కొమ్మల్లో చిక్కుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని, చెరువులోకి వంగి తీగలపై వేలాడుతున్న విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో ఏఈ కె.కృష్ణారావు పరిశీలించారు. రెండు స్తంభాలను సిబ్బందితో నిలబెట్టి తీగలను సరి చేశారు. రెండేళ్లుగా ఉన్న సమస్య సాక్షి కథనంతో పరిష్కారం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రఘురామపై అట్రాసిటీ కేసుకు డిమాండ్

- దూబచర్లలో మాలల మానవహారం
- ఉండి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్

నల్లజర్ల: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివారం దూబచర్ల కూడలికి చేరుకున్న మాలలు మానవహారంగా ఏర్పడి రఘురామకృష్ణంరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం దుశ్చర్య, క్షమించరాని నేరమని వారు పేర్కొన్నారు. మాలలు తొలుత దూబచర్లలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంటుమిల్లి వెంకటేశ్వరరావు, వడ్డి శ్రీను, దొబ్బిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దూబచర్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న మాలలు



నిడదవోలులో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిడదవోలులో..

నిడదవోలు: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావును బూతులు తిడుతూ బెదిరించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి ప్రజల మధ్య కుల, మత ఘర్షణలను రెచ్చగొట్టేలా మాట్లాడిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. దళితులపై కూటమి ఎమ్మెల్యేల తీరును నిరసిస్తూ నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం దళితులు ఆందోళన చేశారు. ఇద్దరు ఎమ్మెల్యేలపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డొంకా రమేష్, అంబటి పుల్లారావు, గెడ్డం కుమార్, కొయ్యే రామారావు, మద్దాల శ్రీను, బయ్యే శ్రీను, దిరిసిన సూర్యచంద్రరావు, గుమ్మడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవం టీడీపీలో వాటర్ ట్యాంక్ వివాదం

- తండ్రి పేరున నిర్మించి ఇచ్చేలా బుల్లిరాజుకు పంచాయతీ తీర్మానం
- అదే స్థలంలో కోడి శంకరం ఆధ్వర్యంలో నిర్మాణం ప్రారంభం
- ఇరువురూ టీడీపీ నాయకులే..

తాళ్లపూడి: మంచినీటి ట్యాంక్ నిర్మించే విషయంలో పెద్దేవం గ్రామంలోని టీడీపీలోని రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. గ్రామస్తుల నుంచి విశ్వసనీయంగా అందిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శుద్ధి చేసిన గోదావరి నీటిని గ్రామస్తులకు సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌ను తన తండ్రి గాంధీ పేరున గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద నిర్మించాలని ఆ గ్రామ టీడీపీ నాయకుడు నామన బుల్లిరాజు నిర్ణయించుకున్నారు. రూ.రెండు లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు వీలుగా ఈ ఏడాది జూలై 29న బుల్లిరాజు పెద్దేవం గ్రామ పంచాయతీ పాలకవర్గం నుంచి



పెద్దేవంలోని సాయి బాబా ఆలయం వద్ద చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణం

ఆమోదం కూడా పొందారు. ఆ తీర్మానం ప్రకారం గ్రామంలోని ఆర్ఎస్ నంబర్ 246 లోని గ్రామ కంఠం స్థలంలో ఆయన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టే సన్నాహాల్లో ఉన్నారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన మరో టీడీపీ నాయకుడు కోడి శంకరం ఆదివారం అదే ప్రదేశంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం మొదలు పెట్టారు. అక్కడకు వెళ్లిన బుల్లిరాజు నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయకపోతే సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. తనకు కేటాయించిన ట్యాంక్‌ను తానే నిర్మిస్తానని స్పష్టం చేశారు. అక్కడ వీడియోలు తీసుకుని బుల్లిరాజు వెళ్లిపోయారు. అయితే తాము సాయిబాబా సేవాదళ్ సభ్యుల తోడ్పాటుతో గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నట్టు శంకరం తెలిపారు. తాము కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అనుమతి తీసుకున్నాకే పనులు చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. దీంతో గ్రామంలోని టీడీపీ నాయకుల మధ్య చోటు చేసుకున్న వివాదంతో పార్టీ పెద్దలకు తలనొప్పి తప్పేలా లేదు. దీనిపై పంచాయతీ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు మాట్లాడుతూ బుల్లిరాజు వాటర్ ట్యాంక్ నిర్మించేలా పంచాయతీ తీర్మానం ఇచ్చామన్నారు. ఆదివారం శంకరం చేపట్టిన నిర్మాణం ఆపాలని నిర్మాణ స్థలానికి పంచాయతీ సిబ్బందిని కూడా పంపామని చెప్పారు. దీనిపై తాళ్లపూడి పోలీసులకు కూడా సమాచారం ఇచ్చామని తెలిపారు.

దేశభక్తిని పెంచేందుకే బృందగాన పోటీలు



బృందగాన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



నిర్వాహకులు అందించిన ప్రశంసా పత్రాలతో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు: విద్యార్థుల్లో దేశభక్తిని పెంచేందుకు బృందగాన పోటీలు, హిందీ, సంస్కృతం, తెలుగు, జానపద గీతాల పోటీలు, భారత్ కో–జానో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు భారత వికాస పరిషత్ జాతీయ కార్యదర్శి ధూళిపాళ పురుషోత్తమ శాస్త్రి పేర్కొన్నారు. భారత వికాస పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృత కళాశాలలో ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి ఇంటర్ మీడియట్ వరకూ చదివే విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పురుషోత్తమ శాస్త్రి చెప్పారు. పదిహేను టీములు ఈ నేషనల్ గ్రూప్ సాంగ్స్ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆచార్య మహామహోపాధ్యాయ దోర్భల ప్రభాకర శర్మ , టీఎస్వీ రమణమూర్తి, జీబీవీ సుబ్రహ్మణ్యం , వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుని ఊరేగింపు



కొవ్వూరు గణేశ్ విగ్రహం ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు, యువతులు



పట్టణంలో వినాయక విగ్రహం ఊరేగింపు

కొవ్వూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా పట్టణంలో ఆదివారం గణనాథుల విగ్రహాల నిమజ్జనాలు వేడుకగా జరిగాయి. స్థానిక ఏటిగట్టుపై ఉన్న ఆరో వార్డు వాడబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పట్టణ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. నిమజ్జనోత్సవంలో మహిళలు సైతం పాల్గొని నృత్యాలు చేశారు. స్థానిక అనన్య థియేటర్ సెంటర్‌లోని విగ్రహాన్ని, దగ్గువారి వీధిలోని వినాయకుడ్ని అంగరంగ వైభవంగా ఊరేగించారు. వివిధ రకాల వేషాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలు, డీజే సౌండ్‌లతో పట్టణం దద్దరిల్లింది.

నవరాత్రులకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం



దేవీ నవరాత్రుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్రుల సందర్భంగా తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకూ నిర్వహించే కోటసత్తెమ్మ వారి దేవీ నవరాత్రుల మహోత్సవాల వాల్ పోస్టర్‌ను నిడదవోలులో మంత్రి దుర్గేష్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాశ్, ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలుకు గోదావరి తాగునీరు

నిడదవోలు: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన అందించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని తీరుగూడెం, సుబ్బరాజుపేట, ఎంవీ నగర్‌లో ఆదివారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొని ప్రభుత్వ పాలన గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే నిడదవోలులో మినీ స్టేడియం, వంద పడకల ఆసుపత్రి, పట్టణ ప్రజలకు గోదావరి జలాలు అందిస్తామని ప్రకటించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గోపాలపురం: మండలంలోని గోపవరం గ్రామంలో ఇటీవల చాపల సుభాష్ అనే వికలాంగ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు.అతడి కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఉక్కుసూరి సురేష్ ఆదివారం రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట ఆ పార్టీ గ్రామ నాయకులు వేముల సత్యనారాయణ, చాపల నాగరాజు, ప్రవీణ్, రిషి, శ్రీను తదితరులు ఉన్నారు.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన పోలుమాటి నాగార్జున లివర్ పాడవడంతో పాటు, పేగు సమస్యతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థికంగా అతడు ఇబ్బంది పడుతున్నాడు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సేవాసంస్థ మండలశాఖ తరపున ఆ సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ ఆదివారం రూ.6 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పలువురు మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



గోపవరంలో మృతుడు సుభాష్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు



అన్నదేవరపేటలో నాగార్జునకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు